సాక్షి
జనగామ

బుధవారం । 19 । ఏప్రిల్ । 2023



శివపార్వతుల కల్యాణం

దేవరుప్పుల మండల కేంద్రంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. చూసేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

- 9లో ▸



గురుకులంలో కరోనా కలకలం

తొర్రూరు పట్టణంలోని బాలికల గురుకులంలో కరోనా కలకలం రేపింది. 8మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
$40^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వేడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగి వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

ఇఫ్తార్	సహర్
బుధ 6:38	గురు 4:32

రంజాన్ వేళలు

కళాకారుల నృత్యప్రదర్శన, వేదికపై మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పక్కన మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు సీతక్క, వినయ్‌భాస్కర్, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు









రామప్ప.. మురిసె

ఘనంగా ప్రపంచ వారసత్వ వేడుకలు

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఉర్రూతలూగించిన ఎస్ఎస్ తమన్ సంగీత విభావరి
- ముఖ్య అతిథులుగా మంత్రులు శ్రీనివాస్‌గౌడ్ ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్

ప్రపంచ వారసత్వ వేడుకల నిర్వహణతో రామప్ప మురిసిపోయింది. విద్యుత్‌వెలుగుల నడుమ నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమ ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రామప్ప ఆలయ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా బలగం సినిమా కళాకారులను సత్కరించారు. కాగా, సాయంత్రం 5గంటలకు ప్రారంభం కావాల్సిన సాంస్కృతిక కార్యక్రమాలు 6:12 గంటలకు ప్రారంభమయ్యాయి. నాయకుల ప్రసంగాలు, సన్మానాలు ముగిసేసరికి ఆలస్యం కావడంతో సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించేందుకు వచ్చిన వారు కొంత అసహనం వ్యక్తం చేశారు.

- వివరాలు 8లో ▸ - ములుగు/వెంకటాపురం(ఎం)

ఆకట్టుకోని ఫుడ్ ఫెస్టివల్
కనీస వసతులు కల్పించలేదని స్టాల్ నిర్వాహకుల ఆగ్రహం

ప్రొటోకాల్ వివాదం..
వెనుదిరిగి వెళ్లిన ఎమ్మెల్యే పొదెం వీరయ్య

- 8లో ▸

న్యూస్‌రీల్

హుండీ ఆదాయం రూ.1.38 లక్షలు



లింగాలఘణపురం: మండల పరిధిలోని జీడికల్ వీరాచల రామచంద్రస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,38,191 వచ్చినట్లు ఈఓ శేషభారతి తెలిపారు. మంగళవారం దేవాదాయశాఖ నల్లగొండ జిల్లా ఇన్‌స్పెక్టర్ సుమతి పర్యవేక్షణలో హుండీ లెక్కించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజు, వైస్ ఎంపీపీ కిరణ్‌కుమార్, దేవాలయ అర్చకులు భార్గవాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ రాములు, సిబ్బంది భరత్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



జనగామ రూరల్: మహిళలు సమాజంలోని అన్యాయాలను ఎదుర్కోవడానికి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మంచాల రవీందర్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాగళ్ల శ్రీహరి అన్నారు. పట్టణంలోని కార్యాలయంలో వీవోఏ మహిళ ప్రతినిధులకు మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ న్యాయ సహాయాన్ని పొందాలన్నారు. సమస్యల పరిష్కారానికి న్యాయ సలహాలు తీసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వీవోఏ అధ్యక్షురాలు పద్మావతి, మహిళలు పాల్గొన్నారు.

పనుల పరిశీలన



తరిగొప్పుల: తరిగొప్పుల, నర్మెట మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలను డీఈఓ రాములు, డీసీఈబీ సెక్రటరీ చంద్రభానుతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని కుమ్మరిపేట ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా నర్మెట, అమ్మాపురంలోని పాఠశాలలో ఎస్ఏ–2 పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. సబ్జెక్ట్ టీచర్లు ఎఫ్ఎల్ఎన్ పోస్ట్ టెస్ట్ ప్రశ్నపత్రాలను సిద్ధం చేయాలని, పరీక్షలను వారి పాఠశాలలో నిర్వహించాలని సూచించారు.

మెడికల్ కళాశాలలో 100 సీట్లకు అనుమతులు

జనగామ: జనగామ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 100 సీట్లకు అనుమతిని జారీ చేస్తూ నేషనల్ మెడికల్ కమిషన్ మెడికల్ అసెస్‌మెంట్, రేటింగ్ బోర్డ్ నుంచి మంగళవారం అధికారులకు లేఖ పంపించారు. కళాశాలలో ఎంబీబీఎస్ కోర్సు ప్రారంభంతో పాటు విద్యార్థుల అడ్మిషన్లకు అనుమతి ఇస్తూ లేఖలో పేర్కొన్నారు. కళాశాలలో 100సీట్ల అనుమతి వచ్చేలా కృషి చేసిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, మంత్రులు దయాకర్‌రావు, హరీశ్‌రావు, కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డికి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రావు, మెడికల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ సుగుణాకర్‌రాజు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు వాగ్దానాన్ని నిలబెట్టుకున్న సీఎంకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

జెడ్పీలో ముసలం..

- నిధుల కేటాయింపులపై జెడ్పీ చైర్మన్ ఇష్టానుసారం
- జనరల్ ఖర్చుల లెక్కలు చూపించాలని సభ్యుల ఆగ్రహం
- స్థాయీ సంఘాల సమావేశానికి దూరంగా ఉండే ప్రయత్నం
- చైర్మన్ బుజ్జగింపుల పర్వం.. తూతూ మంత్రంగా సాగిన సమావేశం



జెడ్పీటీసీలతో చైర్మన్ చర్చలు

జనగామ: జనగామ జిల్లా పరిషత్‌లో ముసలం పుట్టింది. నిధుల కేటాయింపులో చైర్మన్ వ్యవహరిస్తున్న తీరుపై సభ్యులు భగ్గుమంటున్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంటే.. ఇక్కడ మాత్రం వివక్ష కొనసాగుతుందని మండిపడుతున్నారు. ఏడాది కాలంగా గుర్రుగా ఉన్న జెడ్పీటీసీలు.. మంగళవారం నిర్వహించిన ఏడు స్థాయీ సంఘాల సమావేశాలకు దూరంగా ఉండే ప్రయత్నం చేశారు. ఉదయం 10.30 గంటలకు జెడ్పీకి చేరుకున్న 12 మంది జెడ్పీటీసీల్లో 10 మంది సభ్యులు స్థాయీ సంఘాల సమావేశానికి రావడం లేదని చెబుతూ పక్కనే ఉన్న ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి వెళ్లిపోయారు. దీంతో సమావేశానికి హాజరైన జిల్లా అధికారులు సీఈఓ చాంబర్‌తో పాటు సమావేశం హాలులో మధ్యాహ్నం 2.30 గంటల వరకు నిరీక్షించారు.

ప్లీజ్ రండి.. మాట్లాడుకుందాం..

పట్టణం, పల్లెల అభివృద్ధికి సర్కారు అందిస్తున్న నిధులను సమాన ప్రాతిపదికన కేటాయింపులు చేయాలని డిమాండ్ చేస్తూ.. స్థాయీ సంఘాల సమావేశానికి అజయ్(రఘునాథపల్లి), శ్రీను నాయక్ (నర్మెట), పద్మజారెడ్డి (తరిగొప్పుల), గుడి వంశీధర్‌రెడ్డి(లింగాలఘనపురం), వైస్ చైర్మన్ గిరబోయిన భాగ్యలక్ష్మి (బచ్చన్నపేట), మారపాక రవి (స్టేషన్ ఘన్‌పూర్), భార్గవి (దేవరుప్పుల), బేబి (జఫర్‌గఢ్), శ్రీనివాస్(పాలకుర్తి), సత్తెమ్మ (కొడకండ్ల) మొత్తంగా అలకబూనిన జెడ్పీటీసీ లకు జెడ్పీ చైర్మన్ ఫోన్ చేసి చర్చలకు రావాలని బతిమిలాడారు.

గంటన్నర పాటు చర్చలు..

జెడ్పీలో అలకబూనిన జెడ్పీటీసీలతో జిల్లా పరిషత్ చైర్మన్ సంపత్‌రెడ్డి గంటన్నర పాటు చర్చలు జరిపారు. ఎస్ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘం నిధులు, స్పెషల్ గ్రాంట్స్ రిలీజ్ చేసిన సమయంలో మండలాల వారీగా సమాన ప్రాతిపదికన కేటాయింపులు జరగాల్సిన చోట 30 శాతం నిధులు ఎలా తీసుకుంటున్నారని జెడ్పీ చైర్మన్‌ను నిలదీశారు. జెడ్పీ చైర్మన్‌కు ప్రత్యేక కోటా తీసుకోవాలని జీవో ఉందా అని నిలదీశారు. గ్రామాల వారీగా పెండింగ్ పనులకు నిధులు కేటాయించకుండా జెడ్పీటీసీలను బదనాం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

నిధులు ఇలా..



ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జెడ్పీటీసీల చర్చలు



అధికారుల నిరీక్షణ

జనగామ జిల్లా పరిషత్ కార్యాలయం ఏర్పాటైన నాలుగేళ్ల నుంచి ఎస్ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘం, స్పెషల్ గ్రాంట్స్ ద్వారా సుమారు రూ.7.35 కోట్ల నిధులు వచ్చాయి. ఇందులో 30 శాతం చొప్పున జెడ్పీ చైర్మన్ సుమారు రూ.2.20 కోట్లు తీసుకోగా మిగతా జెడ్పీటీసీలకు ఒక్కొక్కరికి రూ.51లక్షల వరకు కేటాయించారు. ఉమ్మడి జిల్లా నుంచి విడిపోయే సమయంలో రూ. 93లక్షలు రాగా.. ఇందులో జెడ్పీ చైర్మన్‌కు అభివృద్ధి పనుల కోసం రూ.28లక్షలు (30 శాతం), మిగతావి జెడ్పీటీసీలకు రూ.5లక్షల చొప్పున ఇచ్చారు. 2020–21లో 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా రూ.1.47కోట్లు రాగా జెడ్పీ చైర్మన్ వాటాలో రూ.39లక్షలు, జెడ్పీటీసీలు ఒక్కొక్కరికి ఆయా పనుల నిర్వహణ కోసం రూ.9లక్షలు కేటాయించారు. 2021–22 సంవత్సరంలో ఎస్ఎఫ్‌సీ నిధులు రూ.63.74 లక్షలు రాగా చైర్మన్‌కు రూ.22 లక్షలు, జెడ్పీటీసీలకు రూ.3 లక్షల చొప్పున అందించారు. 2021–22లో 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా రూ.90.08లక్షలు రాగా 30శాతం చొప్పున జెడ్పీ చైర్మన్‌కు రూ.27.40లక్షలు, సభ్యులకు రూ.5.14 లక్షల చొప్పున కేటాయింపులు జరిగాయి. అదే ఏడాది ఎస్ఎఫ్‌సీ నిధులు రూ.42.10 లక్షలు రాగా జెడ్పీ చైర్మన్‌కు రూ.12.27 లక్షలు, జెడ్పీటీసీలకు రూ.2.33 లక్షలు ఇచ్చారు. స్పెషల్ గ్రాంట్స్ ద్వారా ప్రభుత్వం రూ.3కోట్లు రిలీజ్ చేయగా ఇందులో జెడ్పీ చైర్మన్ వాటాగా రూ.90లక్షలు సభ్యులకు మాత్రం రూ.17లక్షల చొప్పున అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారు. 2022–23లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.50లక్షలు రాగా జెడ్పీ చైర్మన్‌కు 15లక్షలు, సభ్యులకు రూ.2.96 లక్షలు, అదే ఏడాది ఎస్ఎఫ్‌సీ నిధులు రూ.66లక్షలు రిలీజ్ కాగా చైర్మన్‌కు రూ.18 లక్షలు, జెడ్పీటీసీలకు ఒక్కొక్కరికి రూ.3లక్షలుగా కేటాయించారు. కాగా స్పెషల్ గ్రాంట్స్ ద్వారా రూ.2.64 కోట్లు విడుదల చేయగా చైర్మన్‌కు రూ.60లక్షలు, సభ్యులకు రూ.11 లక్షల చొప్పున ఇచ్చారు. కో ఆప్షన్ సభ్యులకు నిధులు ఇస్తే ఇందులో రూ.70వేల చొప్పున తగ్గిస్తామని చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

వారం రోజుల డెడ్‌లైన్

వారం రోజుల్లో నిధుల కేటాయింపులతో పాటు గడిచిన నాలుగు సంవత్సరాల్లో జనరల్ ఖర్చులకు సంబంధించిన ప్రతీపైసాకు లెక్క చూపించాలని జెడ్పీటీసీలు హుకుం జారీ చేశారు. లేని పక్షంలో తదుపరి కార్యాచరణ వెల్లడిస్తామని తేల్చి చెప్పినట్లు సమాచారం. దీంతో జెడ్పీ రాజకీయం కాస్తా ఒక్కసారిగా వేడెక్కింది. మండలాల్లో వందశాతం జరగాల్సిన అభివృద్ధి పనులు ఒక్క మండలానికే పరిమితం చేస్తున్నారని తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసినట్లు తెలుస్తుంది.

విబేధాలు లేవు..

జెడ్పీ పాలక మండలిలో అందరం అన్నదమ్ముల్లా కలిసి ఉంటున్నామని, ఎటువంటి విబేధాలు లేవని జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి అన్నారు. ఏడు స్థాయీ సంఘాల సమావేశం విజయవంతంగా ముగిసిందని తెలిపారు. స్థాయీ సంఘాల సమావేశానికి వచ్చిన సభ్యులు ఎవరూ కూడా అలకబూనలేదన్నారు. కాగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జెడ్పీటీసీలతో చర్చలు జరగడంతో.. స్థాయీ సంఘాల సమావేశాన్ని తూతూ మంత్రంగా పూర్తి చేశారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో వసంత, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అనుమతులకు లోబడే నిర్మాణాలు చేపట్టాలి



కూల్చివేతను పరిశీలిస్తున్న మధుమోహన్, అధికారులు

జనగామ: ప్రభుత్వ నిబంధనల అనుమతులకు లోబడే భవన నిర్మాణాలు చేపట్టాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ కన్వీనర్, రెవెన్యూ డివిజనల్ అధికారి సీహెచ్.మధుమోహన్ అన్నారు. పట్టణంలోని సూర్యాపేట, సిద్దిపేట రోడ్డు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఏరియా గార్లకుంట, కోర్టు వెనకాల ఇంటి నిర్మాణాలను పరిశీలించి.. నిబంధలను పాటించని వాటిని కూల్చి వేశారు. ఈ సందర్భంగా మధుమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్న తర్వాతనే నిర్మాణ పనులు మొదలు పెట్టాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ పనులు చేస్తే చట్టపరమైన చర్యలతో పాటు కూల్చివేతలు ఉంటాయన్నారు. తనిఖీల్లో ఏసీపీ దేవేందర్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి వీరస్వామి, అగ్నిమాపక అధికారి మధుకర్, ఆర్‌అండ్‌బీ డీఈ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు సేవలు



మీసేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న దుర్గారావు

దేవరుప్పుల: ప్రభుత్వ నిబంధనల మేరకు మీ సేవ కేంద్రాల ద్వారా సేవలు అందించాలని మీసేవ జిల్లా మేనేజర్ దుర్గారావు అన్నారు. మండల పరిధిలోని కామారెడ్డి గూడెం, సింగరాజుపల్లి మీసేవ కేంద్రాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి అధిక రుసుము తీసుకోకుండా నిబంధనల ప్రకారం తీసుకోవాలన్నారు. ప్రజలకు అన్ని రకాల సేవలు సత్వరం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం కాకుండా అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



పాఠశాల రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్



కంటివెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శివలింగయ్య

- కలెక్టర్ శివలింగయ్య

జనగామ రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శివలింగయ్య అన్నారు. మండల పరిధిలోని పసరమడ్లలో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని ఆయన తనిఖీచేసి మాట్లాడారు. కంటి వెలుగుపై ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో శిబిరం వద్ద తాగునీరు, కుర్చీలు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం గ్రామంలోని పాఠశాలను పరిశీలించి ప్రధానోపాధ్యాయుడు దివాకర్‌రెడ్డిని పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ రవీందర్, డాక్టర్లు ఆశాజ్యోతి, శ్రావణి, జాన్సీ, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

నర్మెట: అర్హులైన ప్రతిఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శివలింగయ్య అన్నారు. మండల పరిధిలోని హన్మంతాపూర్ రైతు వేదికలోని కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రవీందర్, వైద్యులు ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై పకడ్బందీ చర్యలు

జనగామ రూరల్: ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ చర్యలు చేపట్టామని కలెక్టర్ శివలింగయ్య అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, అధికారులతో కలిసి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఐకేపీ ఆధ్వర్యంలో 111 కేంద్రాలు, సహకార శాఖ ఆధ్వర్యంలో 89 సెంటర్ల నిర్వహణకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలకు బాధ్యతలు అప్పగించి సూచనలు చేశారు.

పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనం



మల్లన్న పట్నాలు కార్యక్రమంలో మాట్లాడుతున్న కడియం

చిల్పూరు: గ్రామాల్లో నిర్వహించే పండుగలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శమని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. మండల పరిధిలోని చిన్నపెండ్యాలలో మాచర్ల కుల సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన మల్లన్నగుడి, పట్నాలు, కల్యాణ కార్యక్రమాన్ని మంగళవారం కడియం శ్రీహరి ప్రారంభించి తిలకించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో దేవాలయాలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. మల్లన్నగుడి ఆలయానికి తన నిధుల నుంచి రూ. 5లక్షలు మంజూరు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కడియం డమరుకం మోగించడం పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లింగారెడ్డి, ఎంపీటీసీ ఉమ సమ్మయ్య, జనగాం యాదగిరి, ఇల్లందుల సుదర్శన్, బూర్ల శంకర్, బెలిద వెంకన్న, గజ్జెల దామోదర్, వైస్ ఎంపీపీ భూక్యా సరిత, సంఘం నాయకులు మాచర్ల శ్రీనివాస్, రమేష్, రామలక్ష్మణ్, కొంరయ్య, రాకేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సందీప్

జనగామ రూరల్: విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేసి ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దడిగే సందీప్ అన్నారు. జనగామ పట్టణంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. రెండేళ్ల నుంచి స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తి స్థాయిలో రాకపోవడంతో పేద విద్యార్థులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఫీజులు కట్టలేక చదువును మధ్యలోనే మానేసే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం విద్యపై చిన్నచూపు చూస్తుందని దుయ్యబట్టారు. కార్పొరేట్ విద్యా సంస్థల్లో విచ్చలవిడిగా ఫీజులు దండుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల రూపాయల ఫీజులు చెల్లించలేక అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ప్రభుత్వం తక్షణం స్పందించి ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రంజిత్‌రెడ్డి, మోహన్, గణేష్, అరవింద్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

నిజాం చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎక్కా చంద్రశేఖర్ జీ

జనగామ రూరల్: నిజాం విముక్తి చరిత్రను సెప్టెంబర్ 17వరకు ప్రజల్లోకి తీసుకెళ్లాలని అది మేధావుల బాధ్యత అని ఆర్ఎస్ఎస్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక క్షేత్ర సేవా ప్రముఖ్ ఎక్కా చంద్రశేఖర్ జీ అన్నారు. పట్టణంలోని విజయ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవ సమితి ఆధ్వర్యంలో మేధావుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం అరాచకాలు సాగించిన అకృత్యాలు, పాలకులపై పోరాడిన వీరుల చరిత్రను వివరించారు. ప్రతీఒక్కరికి ఈ చరిత్రను తెలుపాలన్నారు. మేధావులు తమ బాధ్యతగా సమాజంలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఈ ఏడాదంతా నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాలను నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎరువ ప్రభాకర్‌రెడ్డి, ఉత్సవ సమితి అధ్యక్షుడు కల్నల్ భిక్షపతి, ప్రధాన కార్యదర్శి మోహన్‌కృష్ణ భార్గవ, కోశాధికారి కృష్ణజీవన్ భజాజ్, బాలసిద్ధయ్య, యాదగిరి, మేధావులు, డాక్టర్లు, జర్నలిస్టులు, కవులు, రచయితలు, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో కరోనా కలకలం

- 8 మందికి పాజిటివ్



గురుకులంలో ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ హరీష్‌రాజ్

తొర్రూరు: పట్టణంలోని సంక్షేమ బాలికల గురుకులంలో కరోనా కలకలం రేపింది. పాఠశాలలో మొత్తం 8 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. జ్వరంతో ఉన్న విద్యార్థులను సోమవారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి కరోనా పరీక్షలు చేయించగా అందులో ఒకరికి పాజిటివ్‌గా తేలింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది మంగళవారం పాఠశాలలో పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో మొత్తం 172 మంది విద్యార్థులు, 39 మంది బోధన, బోధనేతర సిబ్బందికి ర్యాపిడ్ టెస్టులు నిర్వహించారు. వీరిలో 8 మందికి కరోనా పాజిటివ్‌గా తేలింది. పాజిటివ్ వచ్చిన విద్యార్థులను ఇళ్లకు పంపించినట్లు ప్రిన్సిపాల్ జయశ్రీ తెలిపారు.

డీఎంహెచ్‌ఓ సందర్శన

గురుకులంలో 8 మంది విద్యార్థులకు కరోనా పాజిటివ్‌గా తేలిన నేపథ్యంలో పాఠశాలను డీఎంహెచ్‌ఓ హరీష్‌రాజ్ సందర్శించారు. కరోనా బారిన పడడానికి దారితీసిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీ సహకారంతో పాఠశాల పరిసరాలు శానిటైజ్ చేయాలని, విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆయన సూచించారు. కోవిడ్ లక్షణాలు ఉన్నవారు వైద్యుల సూచన మేరకు మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గుండాల మురళీధర్, వైద్యులు ప్రియాంక, శృతి, సిబ్బంది పాల్గొన్నారు.

టైరు పేలి.. పల్టీకొట్టిన కారు

- తప్పిన పెనుప్రమాదం

గూడూరు: కంకర తేలి గుంతలుగా ఉన్న రోడ్డుపై వెళ్తున్న ఓ కారు టైరు పేలడంతో ప్రమాదవశాత్తు పల్టీకొట్టగా అందులో ప్రయాణిస్తున్న వారికి పెను ప్రమాదం తప్పిన సంఘటన మంగళవారం బొద్దుగొండ వద్ద చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు నుంచి మహబూబాబాద్ వరకు నేషనల్ హైవే రోడ్డు పనులు మధ్యంతరంగా నిలిచిపోయాయి. దీంతో బొద్దుగొండ వద్ద గల హైటెన్షన్ విద్యుత్ తీగలతో కిలోమీటరు పొడవునా ఎన్‌హెచ్ పనులు నిలిచిపోయాయి. దీంతో రోడ్డంతా కంకరతేలి, గుంతలుగా మారింది. ఈ క్రమంలోనే ఇల్లందు నుంచి వరంగల్ వెళ్తున్న ఓ కారు టైర్ ఒక్కసారిగా ఆ ప్రాంతంలో పేలింది. భారీ శబ్దంతో ప్రమాదవశాత్తు ఎన్‌హెచ్ రోడ్డుపై నుంచి కిందకు మొక్కజొన్న చేను వైపునకు వెళ్లింది. దీంతో పెనుప్రమాదం తప్పింది. కారులో ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలు కాగా వెంటనే వారిని మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

బలగం సినిమా కళాకారులను సన్మానిస్తున్న మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, తదితరులు





రామప్ప మురిసె..

ఘనంగా ప్రపంచ వారసత్వ వేడుకలు

- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- ఉర్రూతలూగించిన ఎస్ఎస్ తమన్ సంగీత విభావరి
- అలరించిన శివమణి డ్రమ్స్, కార్తీక్ గానం





మాట్లాడుతున్న మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతిరాథోడ్



వారసత్వ వేడుకలకు హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు



కళాప్రదర్శన


ములుగు/వెంకటాపురం(ఎం): అంగరంగ వైభవంగా ప్రపంచ వారసత్వ వేడుకల సంబురం మంగళవారం రాత్రి ముగిసింది. సాయంత్రం 6:12 గంటలకు ప్రారంభమైన ఉత్సవాలు అంబరాన్నంటాయి. కళాకారుల నృత్యాలు, పాటలతో రామప్ప ఆలయం మారుమ్రోగింది. ఉత్సవాలకు 15 వేల నుంచి 20 వేల మంది ప్రజలు హాజరవుతారని అధికారులు భావించినప్పటికీ సుమారు 5 వేల మంది మాత్రమే హాజరు కావడంతో గార్డెన్‌లో వేసిన కుర్చీలు వెలవెలబోయాయి. 6:12 గంటలకు కొలువై ఉన్నాడే దేవదేవుడు అనే పాటకు కళాకారిణి అనిశ్రితరెడ్డి చేసిన నాట్యం పలువురిని ఆలరించింది. ములుగుకు చెందిన గోల్కొండ బుచ్చన్న బృందం అమ్మపాటను ఆలపించింది. పేరిణి రాజ్‌కుమార్ బృందం పరమశివుడిపై పేరిణి నృత్య ప్రదర్శన చేశారు. రామప్ప డాక్యుమెంటరీ వీడియోను ప్రదర్శించారు. ఆనంతరం మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్‌ను వేదికపైకి పిలువగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ కళానైపుణ్యాన్ని, తరతరాల చరిత్రను, రామప్ప ఆలయ చరిత్ర, కళను ప్రపంచానికి చాటి చెప్పడమే కాకుండా రాబోయే తరాలకు అందించాలన్నారు. ములుగు జిల్లాలోనే పర్యాటక ప్రదేశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ..కేసీఆర్ పట్టుదలతోనే రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు లభించిందన్నారు. అనంతరం బలగం దర్శకుడు వేణుతో పాటు సినిమా నటీనటులను మంత్రులు సత్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఇంటాక్ కన్వీనర్ పాండురంగారావు, రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీరమల్ల ప్రకాష్‌రావు, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క, ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, జెడ్పీ చైర్మన్లు కుసుమ జగదీష్, గండ్ర జ్యోతి, రెడ్‌కో చైర్మన్ సతీష్‌రెడ్డి, ఐటీడీఏ పీఓ అంకిత్, అదనపు కలెక్టర్లు ఇలా త్రిపాఠి, వైవీ గణేష్, ఎస్పీ గాష్ ఆలం, ఓఎస్‌డీ అశోక్‌కుమార్, ఆర్డీఓ రమాదేవి, జెడ్పీ వైస్ చైర్మన్ నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా ఎస్ఎస్ తమన్, శివమణి

ప్రపంచ వారసత్వ ఉత్సవాల్లో ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్, ప్రముఖ వాయిద్య కళాకారుడు శివమణి, సింగర్ కార్తీక్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సుమారు గంట ఇరవై నిమిషాల పాటు సంగీత ప్రదర్శన, డ్రమ్స్ సౌండ్స్‌తో సభా ప్రాంగణం దద్దరిల్లింది. సింగర్ కార్తీక్ పాటలు పాడి ప్రజలను ఉత్తేజపర్చారు. శ్రావ్యమానస డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సుమారు 200 మంది కళాకారులు అరగంట పాటు చేసిన క్లాసికల్, ఫోక్ నృత్య ప్రదర్శన ప్రజలను ఆకట్టుకున్నాయి.

వెలవెలబోయిన సభాప్రాంగణం

వారసత్వ ఉత్సవాల వేడుకలకు సుమారు 15 నుంచి 20 వేల మంది ప్రజలు హాజరవుతారని భావించినప్పటికీ ప్రజలు ఉత్సవాలపై ఆసక్తి చూపలేదు. రామప్ప ఆలయం ఎదుట నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌కు కూడా ప్రజల నుంచి ఆదరణ లభించలేదు. ఉత్సవాలకు ప్రజలు రాకపోవడంతో గార్డెన్‌లో వేసిన కుర్చీలు వెలవెలబోయాయి. ఉత్సవాల సందర్భంగా పలుచోట్ల పోలీసులు అత్యుత్సాహం చూపి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారు. మీడియా ప్రతినిధులను సైతం సభావేదిక వద్దకు అనుమతించలేదు. మీడియా పాస్‌లు ఉన్నప్పటికీ అక్రిడేషన్ కార్డు చూపెడితేనే మీడియా గ్యాలరీలోకి అనుమతించినప్పటికీ సభావేదిక దూరంగా ఉండడంతో ప్రతినిధులు ఇబ్బందులకు గురయ్యారు.



స్వాగత నృత్యం చేస్తున్న కళాకారిణి



సాంస్కృతిక కార్యక్రమాల్లో కళాకారులు



సంగీత విభావరిలో తమన్, గాయకులు



డ్రమ్స్ వాయిస్తున్న శివమణి

ప్రొటోకాల్ వివాదం..

- వెనుదిరిగి వెళ్లిన ఎమ్మెల్యే పొదెం వీరయ్య
- వేదికపైకి స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించకపోవడంపై ఆగ్రహం



సభా వేదిక నుంచి వెనుతిరుగుతున్న భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య

ములుగు/వెంకటాపురం(ఎం): రామప్పలో జరిగిన వారసత్వ ఉత్సవాల్లో ప్రొటోకాల్ వివాదం చోటుచేసుకుంది. సభావేదికపైకి మంత్రులను, ఇతర ఎమ్మెల్యేలను, కార్పొరేషన్, జెడ్పీ చైర్మన్లను, వేదికపైకి ఆహ్వానించి సకాలంలో తనను పిలువలేదనే నెపంతో రామప్ప నుంచి హనుమకొండకు భద్రాచలం ఎమ్మెల్యే వీరయ్య వెనుదిరిగి వెళ్లిపోయారు. మంత్రులు రాకముందే రామప్పకు చేరుకున్న వీరయ్యను మంత్రులు వచ్చిన తర్వాత ప్రొటోకాల్ ప్రకారం వేదికపైకి పిలువకుండా నామినేటెడ్ పోస్టులు ఉన్న వారిని తనకంటే ముందు పిలువడంతో అసంతృప్తికి గురైనట్లు సమాచారం.

ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానిక ప్రజాప్రతినిధులు

ప్రపంచ వారసత్వ ఉత్సవాల్లో వేదికపైకి మంత్రులను, ఎమ్మెల్యేలను, చైర్మన్‌లను, అధికారులను ఆహ్వానించినప్పటికీ స్థానిక సర్పంచ్ డోలి రజిత, ఎంపీపీ బుర్ర రజిత, జెడ్పీటీసీ రుద్రమదేవిలను వేదికపైకి ఆహ్వానించలేదు. దీంతో వారు వేదిక ముందే తమను అవమానపరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాగ్వాదానికి దిగారు. చేసిన తప్పును తెలుసుకున్న అధికారులు ప్రజాప్రతినిధులను తర్వాత పిలిచినప్పటికీ వేదికపైకి వెళ్లలేదు. గతంలో రామప్ప పర్యటనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వచ్చిన సమయంలో అధికారులు తమను వేదికపైకి ఆహ్వానించకుండా అవమానపరిచారని సర్పంచ్ రజిత రాష్ట్రపతి కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. దీంతో స్పందించిన రాష్ట్రపతి కార్యాలయం విచారణ చేయాల్సిందిగా సీఎంఓ కార్యాలయాన్ని ఆదేశించింది. రామప్పలో కార్యక్రమాలు జరిగినపుడల్లా తమను వేదికపైకి పిలువకుండా అధికారులు అవమానపరుస్తున్నారని, మహిళా ప్రజాప్రతినిధులుగా ఉండడమే తమ శాపమా అని ప్రజాప్రతినిధులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

'ఫుడ్ ఫెస్టివల్'కు ఆదరణ కరువు

- స్టాల్ నిర్వాహకుల్లో అసంతృప్తి
- రామప్ప ఆలయం ఎదుట40 స్టాల్స్ ఏర్పాటు
- కనీస వసతులు లేవని నిర్వాహకుల ఆగ్రహం



రామప్ప ఆలయం ముందు వెలవెలబోయిన స్టాల్స్



టేబుళ్లు లేకపోవడంతో కంజోవర్ పెయింట్స్‌ను ప్రదర్శన చేయని రంజిని విశాల్

వెంకటాపురం(ఎం): ప్రపంచ వారసత్వ ఉత్సవాల్లో భాగంగా రామప్ప ఆలయం ఎదుట నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమానికి ఆదరణ కరువైంది. వేలాది రూపాయలు వెచ్చించి రామప్పకు వచ్చి స్టాల్స్ ఏర్పాటు చేస్తే కనీస వసతులు కల్పించలేదని నిర్వహకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయం ఎదుట 40 స్టాల్స్‌ను వివిధ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో ఈవెంట్ ఆర్గనైజర్‌కు సంబంధించి గురు ప్రొడక్షన్ వారు ఆహ్వానిస్తే హైదరాబాద్‌కు చెందిన గోల్డెన్ ఉమెన్స్ క్లబ్ నుంచి 13 మంది స్టాల్స్ ఏర్పాటు చేసుకునేందుకు రామప్పకు వచ్చారు. ఉదయం 10 గంటలకు వస్తే కేవలం టెంట్ మాత్రమే వేసి ఇచ్చారన్నారు. కనీసం టేబుళ్లు కూడా ఇవ్వకపోతే తాము తీసుకొచ్చిన వస్తువులను ఎలా ప్రదర్శించాలని విచారం వ్యక్తం చేశారు. ఎంతో ఆశతో ఫుడ్ ఐటమ్స్ తీసుకొచ్చామని కానీ విక్రయించే అవకాశాలు తమకు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో ఆశతో వచ్చి నిరాశతో వెనుదిరిగి వెళ్లాల్సి వస్తుందని వాపోయారు.

వసతులు కల్పించలేదు



ఈవెంట్ ఆర్గనైజర్ సూచన మేరకు గురుప్రొడక్షన్ వారు ఆహ్వానిస్తేనే రామప్ప ఫుడ్ ఫెస్టివల్‌కు వచ్చాం. ఉదయం 10 గంటలకు రామప్పకు వస్తే స్టాల్స్ ఏర్పాటులో సౌకర్యాలు కల్పించలేదు. టెంట్ మాత్రమే వేసి నిర్వాహకులు చేతులు దులుపుకున్నారు. హైదరాబాద్ నుంచి 13 స్టాల్స్ ఏర్పాటు చేసుకునేందుకు వస్తే 4 స్టాల్స్ మాత్రమే కేటాయించి సౌకర్యాలు మాత్రం కల్పించలేదు.

– ఉమా పేరి, గోల్డెన్ ఉమెన్స్ క్లబ్ ఫౌండర్, హైదరాబాద్

గుండెపోటుతో వివాహిత మృతి



సృజన (ఫైల్)

నెల్లికుదురు: జపాన్ నుంచి వచ్చిన వారం రోజులకే గుండెపోటుకు గురై ఓ వివాహిత మృతి చెందిన సంఘటన మండలంలోని చిన్నముప్పారంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన కదిర రాకేష్-సృజన (32) దంపతులు గత కొన్నేళ్లుగా జపాన్‌లో ఉద్యోగం చేసుకుంటూ స్థిరపడ్డారు. ఈ క్రమంలో సృజనకు కొన్ని నెలలుగా ఆరోగ్యం సహకరించడం లేదన్నారు. ఆరోగ్యం కుదుట పడకపోవడంతో వారం రోజుల క్రితం జపాన్ నుంచి వచ్చి వరంగల్‌లో తన బంధువుల ద్వారా రోహిణి ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నట్లు తెలిపారు. మంగళవారం గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి 5 ఏళ్ల కూతురు ఉంది.

మున్సిపాలిటీల్లో 'అవిశ్వాసం'!



భూపాలపల్లిలో సమావేశమైన కౌన్సిలర్లు

ఒక్కొక్కటిగా బయటపడుతున్న అసంతృప్తి

- తాజాగా భూపాలపల్లి చైర్మన్, వైస్ చైర్మన్‌లపై నోటీసు
- జనగామ పాలకవర్గంపై కొనసాగుతున్న సస్పెన్స్
- ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలకు 'అవిశ్వాసం'తలనొప్పి
- మరో రెండు మున్సిపాలిటీలలో మొదలైన అసంతృప్తి?

సాక్షిప్రతినిధి, వరంగల్: మున్సిపాలిటీల్లో అవిశ్వాస రాజకీయాలు మళ్లీ వేడెక్కుతున్నాయి. ఒకరిని చూసి ఒకరు కావొచ్చు.. చైర్మన్, వైస్ చైర్మన్‌లపై ఆగ్రహం కావొచ్చు.. 'మాకెప్పుడు అవకాశం'అన్న ఆలోచన.. ఇలా కారణాలేమైనా అధికారంలో ఉన్న సభ్యులే అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇవ్వడం చర్చనీయాంశం అవుతోంది. నివురుగప్పిన నిప్పుల ఉన్న అసంతృప్తి ఒక్కసారిగా అవిశ్వాసం రూపంలో బయటకు వస్తుండడం స్థానిక ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులకు తలనొప్పిలా మారుతోంది. ఉమ్మడి వరంగల్‌లో మొదటగా జనగామ మున్సిపల్ కౌన్సిలర్లు .. చైర్‌పర్సన్ పోకల జమున, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్‌లపై అవిశ్వాసం నోటీసు ఇచ్చారు. ఆ గొడవంతా ఇప్పుడిప్పుడే కొలిక్కి వస్తున్న తరుణంలో భూపాలపల్లి మున్సిపాలిటీలో అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు.. చైర్‌పర్సన్ వెంకటరాణి, వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం బీఆర్ఎస్‌లో కలకలం రేపుతోంది.

జనగామలో మొదలై.. భూపాలపల్లి వరకు...

ఉమ్మడి వరంగల్‌లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కాకుండా 9 మున్సిపాలిటీలు ఉన్నాయి. జనగామ మున్సిపాలిటీ నుంచి మొదలైన అవిశ్వాసం పొగ భూపాలపల్లి వరకు పాకింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, ఫ్లోర్‌లీడర్ పాండులపై అవిశ్వాస నోటీసులను అందించారు. ఆ ముగ్గురిని తప్పించడం కోసం 11 మంది బీఆర్ఎస్, 8 మంది కాంగ్రెస్ సభ్యులు కలిపి మొత్తం 19 మంది యశ్వంతాపూర్ రేణుక ఎల్లమ్మ గుడి అవిశ్వాస పత్రాలపై సంతకాలు చేసి జనవరి 25న లేఖను అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కు అందించి క్యాంపులకు వెళ్లారు. బల నిరూపణకు ఎటువంటి తేదీలు ప్రకటించలేదు. ఒకరోజు తర్వాత జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఫోన్‌లో బుజ్జగించే ప్రయత్నం చేయగా ఎవరూ వినలేదు. ఇదే సమయంలో పాలకవర్గం కోర్టుకు వెళ్లి స్టే తీసుకోగా, అసంతృప్తికి కారణమైన ఫ్లోర్ లీడర్ మారబోయిన పాండును ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి తప్పించారు. దీంతో అంతా సద్దుమణిగిపోయిందని భావిస్తున్న తరుణంలో బుధవారం భూపాలపల్లి మున్సిపాలిటీలో అధికార పార్టీకి చెందిన 20 మంది కౌన్సిలర్లు చైర్మన్ వెంకటరాణి సిద్ధూ, వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌లపై అవిశ్వాస తీర్మానం జిల్లా లోకల్ బాడీ అడిషనల్ కలెక్టర్ దివాకర్‌కు అందజేయడం అధికార పార్టీకి మరో షాక్‌లా అందరూ భావిస్తున్నారు.

ఒంటెద్దుపోకడలే కారణమా..

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ రూ.కోట్లల్లో నిధులు వెచ్చిస్తోంది. స్థానిక ఎమ్మెల్యేలు, నేతల కనుసన్నల్లో పాలకవర్గాలు ఆ నిధులు సద్వినియోగం చేయాల్సి ఉంది. కొందరు చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు అధికారదర్పం, ఒంటెద్దుపోకడలను సహచర కౌన్సిలర్లు జీర్ణించుకోవడం లేదు. ఫలితంగా పెరుగుతున్న అసంతృప్తి అవిశ్వాసం వైపు తీసుకెళ్లుండగా, ఎమ్మెల్యేలు బుజ్జగింపులు సైతం ఫలితాలు ఇవ్వడం లేదు. వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లోని మరో రెండు మున్సిపాలిటీల్లోనూ అసంతృప్తి చాపకిందనీరులా మారినట్లు సమాచారం. కాగా భూపాలపల్లిలో అవిశ్వాసం నోటీసుతో పాటు బీఆర్ఎస్ పార్టీ అర్బన్ ఉపాధ్యక్షుడు, హనుమాన్ టెంపుల్ డైరెక్టర్‌తో పాటు ముగ్గురు కలిసి ఇదే రోజు రాజీనామా చేయడంతో బీఆర్ఎస్‌లో ముసలం మొదలైందన్న చర్చ జరుగుతోంది.